కథ

# నన్నిలా బ్రతకనీరా

''జయమ్మగారూ!''

ఇంట్లోకి వస్తూనే రఘురాం ిలిచాడు.

''ఆవిడ లేరండీ! పాపని తీ ుకుని గుడికి వెళ్లింది!'' కల్పన లోపలి నుండి వస్తూ చెప్పింది.

డ్రైవర్ మెడికల్ బ్యాగు తీస కొచ్చి లోపల పెట్టాడు. డ్రైవర్‌తో-

''చంద్రం పొద్దున్నే వచ్చెయ్ ఆపరేషన్ కేసు వుంది!'' అన్నాడు డాక్టర్ రఘురాం.

''అలాగే సార్'' డ్రైవర్ వెళ్లి ోయాడు.

రఘురాం సోఫాలో కూర్చుని టై విప్ప కల్పనకిచ్చాడు.

''ఏమిటి? రాగానే జయమ్మని పిలి రు!'' అనడిగింది కల్పన.

''ఆవిడకి ఒక ఉత్తరం వచ్చింది! శరణ యం అడ్రసుకు వస్తే శ్రీధర్ నాకు పంపిం డు. ఇదిగో..'' జేబులో నుండి ఉత్తరం తీసిచ్చా .

''ఉత్తరం చింపి వుందే!''

''శరణాలయానికి వచ్చిన ప్రతి వుత్తరం చదవడం వాళ్ల రూలు. విశేషాలేం లేవు. నువ్వా చదువు'' అన్నాడు.

కల్పన విప్పి చదివింది.

''అమ్మా!

వచ్చే గురువారం నిన్ను ఇంటికి తీసుకె ానికి శరణాలయానికి వస్తున్నాను. ఈ విషయం ధర్ గారికి చెప్పు. మిగతావన్నీ నేను వచ్చాక చె ు-

రాజారావు.''

''వాళ్ల అమ్మ ఇంకా శరణాలయంలోనే ుంద నుకుంటున్నాడు'' ఉత్తరం మడుస్తూ ంది కల్పన.

''శరణాలయంలో చేర్చేటప్పుడు తల్లి పోషణకు నెలనెలా డబ్బు పంపిస్తానని చెప్పి ాడు నెలలు పంపి...ఆ తర్వాత హఠాత్తుగా ానేశాడు. దుర్మార్గుడు'' రఘురాం కో ంగా అన్నాడు.

''అసలావిడని శరణాలయంలో చేర్చ ానికి అతని మనసెలా ఒప్పిందోనండీ! ఆవిడ వ ంటికొచ్చి ఏడాదవుతోందా? ఆవిడ విసు గా చూడలేదు. ఎంత ఓర్పు..ఎంత సహనం?'' ంది కల్పన.

''శరణాలయంలో కూడా. ఆవిడ వ చ్చి ట్నించీ శ్రీధర్‌కి ఎంతో సహాయంగా వు ేది. అక్కడున్న వృద్ధులను, రోగులను కన్న ల్లా చూసేది. కొడుకు డబ్బు పంపకపో ునా అందుకే ఆవిడ్ని శరణాలయంలోనే వుంచు ాలనుకున్నాడు. కానీ రూల్సు ఒప్పుకోవు గదా! ఆ బాధంతా ఒకరోజు నా దగ్గరికొచ్చి చెప్పుకున్నాడు. అప్పుడే నువ్వు జబ్బు పడడంతో మనం కూడా మనిషి కోసం చూస్తున్నాం గదా! అలా కాకతాళీయంగా ఆవిడ మనింటికి రావడం జరిగింది.''

''అవునండీ! ఆవిడ రావడం మన అదృష్టం. మనింట్లో మనిషైపోయింది. ఆమెని శాశ్వతంగా మనింట్లోనే వుంచుకోవాలనుకున్నాం గదా! ఇప్పుడావిడ వెళ్లిపోతుందంటే బాధగా వుందండీ!''

''వెళ్ళినప్పటి సంగతి గదా!''

''ఎందుకు వెళ్లదండీ! కొడుకు రమ్మని పిలిస్తే ఏ తల్లయినా వెళ్లకుండా ఉంటుందా?'' అంది కల్పన.

''వాడా! కొడుకు? ముసలి వయసులో-ఎంతో జాగ్రత్తగా చూడాల్సిన తల్లిని..శరణాలయంలో పడేశాడు. ఆ తర్వాత ఆవిడ సంగతేమీ పట్టించుకోలేదు..''

పనిపిల్ల కాఫీ తెచ్చింది.

''ఇప్పుడు కాఫీ వద్దులే. ఎనిమిది అవుతోంది. భోజనం చేస్తా!'' అన్నాడు రఘురాం బూట్లు విప్పుకుంటూ.

''సరే! ఆ కప్పు ఇటుతే!'' అంది కల్పన.

''ఇదుగో..కాఫీలు-టీలు త్రాగొద్దని చెప్పానా కప్పు తీసుకుపో..అమ్మగారికివ్వొద్దు'' అన్నాడు రఘురాం.

పనిపిల్ల లోపలికి వెళ్లిపోయింది.

''కల్పనా! ఇప్పుడిప్పుడే నీ ఆరోగ్యం కుదుట పడుతోంది. కొద్దిరోజులు నేను చెప్పినట్లు విను!'' అన్నాడు సోఫాలో నుండి లేస్తూ..

''జయమ్మ వెళ్లిపోతే నా ఆరోగ్యం మళ్లీ మొదటికి వస్తుందేమో..'' కల్పనే తనతా లేచింది.

''ఆవిడ వెళ్లదులే!''

రఘురాం బాత్‌రూమ్‌లోకి వెళ్లాడు.

పనిపిల్ల టేబిల్‌పై కంచాలు పెట్టింది.

''ఈవిడ ఇంకా రాలేదు. శరణాలయానికి వెళ్లిందంటావా?'' భోజనం చేస్తూ రఘురాం అన్నాడు.

''వూహు..పాప వుండగా వెళ్లదు'' అంది కల్పన.

''వారానికి రెండు మూడుసార్లయినా శరణాలయానికి వెళ్లి ఆ వృద్ధులను చూడందే వుండలేదు. శ్రీధర్ కూడా ఆవిడలాటి స్త్రీ ఎక్కడా వుండదని ఎంత పొగుడుతాడో..''

''అవునండీ! ఈమధ్య పాపకి కూడా బాగా అలవాటయింది..ఆవిడ వెడితే బెంగ పెట్టుకుంటుందేమో!''

ఇంతలో..

''అమ్మా!'' అంటూ పాప పరుగెట్టుకు వచ్చింది.

''రా! తల్లీ వచ్చావా! ఇంకా రాలేదేమా అనుకుంటున్నా'' అంటూ పాపకి కంచంలో అన్నం పెట్టింది.

''పాపా! చేతులు కడుక్కురా!''

''ఇవ్వాళ గుళ్ళో జనం బాగా వున్నారు. అందుకు ఆలస్యమైందమ్మా!'' జయమ్మ వస్తూనే సంజాయిషీగా చెప్పింది.

''జయమ్మగారూ! మీకొక శుభవార్త!'' అన్నాడు రఘురాం.

''ఏమిటన్నట్లు'' చూసింది.

''మీ అబ్బాయి రాజా. మిమ్మల్ని తీసుకెళ్లడానికి వచ్చే గురువారం వస్తున్నాడు..''

జయమ్మ ఆశ్చర్యపడింది.

''మా అబ్బాయి వస్తున్నాడా?''

''నిజమేనండీ! ఇదుగో వుత్తరం'' ప్రక్క టేబిల్‌పైనున్న వుత్తరం తీసి ఆవిడకిచ్చింది కల్పన.

జయమ్మ ఆత్రంగా విప్పి చదువుకుంది.

''నమ్మకం కుదిరిందా..మీ అబ్బాయి వచ్చేసరికి రెడీగా వుండండి..మరి.'' నవ్వింది కల్పన.

ఆవిడ ఏం మాట్లాడకుండా వుత్తరం తీసుకుని గబగబా తన గదిలోకి వచ్చింది! మంచం మీద కూర్చొని వుత్తరం తీసి మళ్లీ చదువుకుంది.

రాజా! వస్తున్నాడు. తనని ఇంటికి తీసుకెళ్లడానికి వస్తున్నాడు.

''రాజా! రాజా!'' కొడుకు పేరు తలుచుకుంటోంటే తెలీని ఉద్వేగంతో ఆమె శరీరం వణికిపోయింది. కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

''నాయనా! రాజా! ఎంత కాలానికి ఈ తల్లి



నీకు గుర్తొచ్చిందిరా..నువ్వు నన్ను పూర్తిగ మర్చి పోయావనుకున్నాను. కానీ నన్ను తీసుక్కె ానికి వస్తున్నావంటే ఈ అమ్మ నీకింకా గుర దన్న మాట...నువ్వు మారిపోయావనుకున్నా చిట్టి తండ్రీ! కానీ నువ్వు మారలేదు. నువ్వు టికి నా రాజావే..'' అనుకుంటూ ఉత్తరాన్ని ండె లకు హత్తుకుంది.

ఒక్కసారిగా గతం ఆమె కళ్ల ముంద మెది లింది. రాజా ఒక్కగానొక్క కొడుకు..వా చిన్న ప్పుడే తన భర్త గతించాడు. అప్పటివరకూ ఫీగా సాగిపోతున్న జీవననౌక ఒక్కసారిగా సుడిగుం డంలో చిక్కుకున్నట్లయింది..తన భర్త మెం టరీ స్కూలు టీచరు. తాతలనాటి పెం టిల్లు తప్ప వేరే ఆధారం లేదు. తండ్రిలేని లో తెలీ కుండా కొడుకుని పెంచి పెద్దవాడిని చేయాలను కుంది. వాడిని పట్నంలో హాస్టల్లో వుంచింది. వాడి చదువుకోసం..హాస్టలు ఫీజు కోసం తనెంత కష్టప డిందో? ఆ దేవుడికి తెలుసు. ఆ పల్లెటూళ్లో కూలీ పని చేస్తూ వాడిని చదివించింది. తను గంజినీళ్లు తాగినా..వాడికి పరమాన్నం పెట్టింది. కష్టం ఫలించి రాజారావు ఇంజనీరయ్యాడు. వాడికి పెద్ద కంపెనీలో ఉద్యోగం వచ్చిందని తెలీగానే తన కలలు నిజమయ్యాయని సంతోషించింది. వాడు పని చేసే కంపెనీ మేనేజరు కూతుర్ని ప్రేమిం చాను...పెళ్లి చేసుకుంటానంటే పెద్దింటి సంబంధ మని భయపడిందే కాని వాడి కోరికను కాదన లేదు!

**విన్నకోట సుశీలాదేవి**

''అమ్మా! నాకు క్వార్టర్సు ఇచ్చారు. నువ్వీ పల్లెటూళ్లో ఎందుకు? నా దగ్గర వుందువుగాని వచ్చెయ్యమ్మా!'' అని కొడుకు అనగానే ఆనం దంతో పొంగిపోయింది.

కొడుకూ-కోడలూ చిలకా గోరింకల్లా కాపరం చేస్తోంటే చూసి సంతోషించడంకంటే ఈ చివరిదశలో తను కోరుకునేదేముంది? అను కుంది. ''ఇక ఈ పల్లెటూళ్లో ఈ ఇల్లు ఎందుకు? అమ్మేస్తాను..'' అని కొడుకంటే కాదనలేదు.

అదే తను చేసిన పెద్ద తప్పని ఆనాడు ఊహించ లేకపోయింది. కోడలు తనతో మాట్లాడకపో వడం—తను మాట్లాడించినా ముభావంగా సమా ధానం చెప్పడం..మొదట్లో తను పట్టించుకోలేదు అది ఆమె స్వభావమనుకుంది. కాని తర్వాత ర్వాత తెలిసింది తనంటే కోడలికి అసహ్యమని.

''అంత నల్లటి మనిషికి మీలాంటి తెల్లటి కొడుకు ఎలా పుట్టారండీ! మనిషి రూపానికి తోడు బొత్తిగా శుభ్రం లేదు..ఆవిడ ఇంట్లో తిర గుతూంటే భరించలేపోతున్నాను..''

''అందరూ నీలా అందంగా వుంటార డియర్! నీకిష్టం లేకపోయినా ఆవిడ ఇక్కడ వుండక తప్పదు నీరూ! ఈ వయసులో ఎక్కడికి ళ్తుంది? నువ్వే కొంచెం సర్దుకో..ప్లీజ్! నాకోసం.''

ఆ మాటలు చెవులారా విన్నాక..ఆ ఇంట్లో ఒక్కక్షణం వుండబుద్ధి కాలేదు. ఆ పల్లెటూర వదిలి పెట్టి కొడుకుతో రావడం పొరపాటయింది చాలా పెద్ద తప్పు చేశాను. అనుకుంది.

ఆ మర్నాటి నుండీ కోడలితో మాట్లాడటం పూర్తిగా మానేసింది. ఆమెను తప్పించుకు తిర గుతూ తనొక ప్రక్కన ఒదుగుతూ కాలం వెళ్లబు చ్చసాగింది.

కాని ఒకరోజు అనుకోని సంఘటన జరిగింది

ఒక సాయంత్రం వేళ..నీరజ స్నేహితుల వచ్చారు.

''లక్ష్మీ! కాఫీలు తీసుకురా!'' నీరజ హాల్లోంచి అరిచింది.

''లక్ష్మి లేదు!'' తను మెల్లగా అంది.

నీరజ చరచరా లోపలికొచ్చింది.

''లక్ష్మి ఎక్కడికి వెళ్లింది?'' ఎటో చూస్తూ అడిగింది.

''మార్కెట్‌కి వెళ్లింది!''

''ఛ! సమయానికి వుండదు!'' విసుక్కుంది.

''పోనీ కాఫీలు నేను కలిపి తీసుకురానా?''

''వూ'' అనేసి వెళ్లిపోయింది నీరజ.

తరుగుతున్న కూరల గిన్నె ప్రక్కన పెట్టి లేచి కాఫీలు కలిపి ట్రేలో పెట్టుకుని ముందు గదిలో వెళ్లింది. అందరికీ కప్పులు అందించింది.

''నీరజా! ఎవరీవిడ. మీ వంటమ నిషా?''

ఒక స్నేహితురాలు అడిగింది.

నీరజ వెంటనే ''అవును'' అనే సింది.

ఆ మాట వినగానే తన చేతిలోని ట్రే జారిపడింది. ట్రేలో వున్న నీటి చుక్కలు ఒకావిడ పట్టుచీరపై పడ్డాయి.

నీరజ కోపంగా చూసింది.

''ఛీ! ఛీ! మీ వంటమనిషికి మంచీ మర్యాదా తెలీనట్లుందే...పట్టుచీర పాడయింది..''

''ఒట్టి కంట్రీబ్రూట్..సారీ..'' అంటూ నీరజ తనపై అరిచింది.

అందరూ తలోమాటా అనసాగారు. వినలేక గబగబా వచ్చేసింది. కోడలు అందరిముందూ తనని అవమానించినందుకు కోపం—దుఃఖం పొంగుకు వచ్చాయి.

ఆ రాత్రి కొడుకు ఇంటి కొచ్చాక..అతనితో చెప్పే వరకూ ఆగలేకపోయింది.

''నేనీ అవమానాలు భరించలేనురా! మన పల్లెకు పంపించు అక్కడెలాగో బతుకుతాను!'' అంది ఏడుస్తూ!

ఆ రాత్రి కొడుకు కోడలితో ఏం మాట్లాడాడో గానీ మర్నాడుదయం అన్నాడు. ''అమ్మా! మీ ఇద్దరికీ పడదు..ఆ పల్లెటూళ్లో ఒంటరిగా ఎలా వుంటావు? అందుకే నిన్ను వృద్ధుల శరణాల యంలో వుంచాలనుకుంటున్నాను.''

తనేం మాట్లాడలేదు. ఈ ఇంట్లో తప్ప ఇంకె క్కడున్నా తనకిష్టమే! శరణాలయంలో చేరాక మొదటిసారిగా జీవితంలో మానసికశాంతి పొందింది...శరణాలయంలోని రోగార్తులకు అశ క్తులకు సేవచేస్తూ..వారి ఆదరణ..ఆప్యా యత..అనురాగాల మధ్య వాళ్లల్లో ఒకరై..కలిసి మెలిసిన జీవనంలోని సుఖాన్ని అనుభవిస్తోంది.

కోడలెప్పుడో మరిచింది..కొడుకుని కూడా మరచిపోవడానికి ప్రయత్నిస్తున్న సమయంలో మళ్లీ ఇదేమిటి. తనకు వర్తమానమే కాని గతం లేద నుకుంది. ఆ పీడకలని మనసులోంచి తుడిచి వేస్తున్న తరుణంలో ఉరుమూ—మెరుపూ లేని ఈ పిడుగుపాటేమిటి? ప్రశాంతంగా సాగే నీటిలో ఈ అలజడి ఎందుకో?

ఆలోచిస్తూ నిద్రలేని రాత్రిని గడిపింది జయమ్మ.

★★★

ఆరోజు గురువారం.

ఉదయం నుండీ జయమ్మ అన్యమనస్కంగా వుంది. ఏ పని మీదా ధ్యాస లేదు. కాఫీలో పంచ దార బదులు ఉప్పు వేసింది. ఉప్మాలో ఉప్పు బదులు కారం వేసింది.



కల్పన నవ్వుతూ ''జయమ్మగారి మనసు కొడుకు మీదకు మళ్లింది! ఉప్మా గొడ్డుకారం!'' అంది ప్లేటు తోసేస్తూ.

''అయ్యో! చూసుకోలేదమ్మా! మళ్లీ చేస్తాను!'' అంది జయమ్మ నొచ్చుకుంటూ.

''ఏం వద్దు. ఈ రోజు వంట నేను చేస్తాను. మీరలా కూర్చోండి'' అంది కల్పన జయమ్మని కుర్చీలో కూర్చోబెడుతూ.

''కల్పనా! ఇవ్వాళ జయమ్మగారు మన గెస్ట్. మన ముగ్గురికీ మంచి కాఫీ కలుపుకురా!'' అన్నాడు రఘురాం, డైనింగ్ టేబిల్ ముందు తనూ ఒక కుర్చీలో కూర్చుంటూ!

కల్పన కాఫీ కప్పులు తెచ్చింది.

''తీసుకోండి!''

కాఫీ కప్పు అందుకొంటోంటే జయమ్మ చెయ్యి వణికింది.

''ఏ క్షణాన మీ ఇంటికి వచ్చానో..నా అదృష్టం..నన్ను మీలో ఒకరిలా చూసుకుంటు న్నారు..'' అంది అభిమానంతో కళ్లు చెమర్చగా.

''అంతా మీ మంచితనం! ఇన్నాళ్లూ పెద్దది క్కుగా మాకు కొండంత అండగా వున్నారు. మీరు వెళ్లిపోతారంటే బాధగా వుంది!'' అంది కల్పన!

''నాకూ అలాగే వుందమ్మా! అయినా నేనింకా వెళ్లాలో? వద్దో నిర్ణయించుకోలేకపోతున్నాను!'' అంది జయమ్మ.

''ఇప్పుడలాగే అంటారు! సాయంత్రం మీ అబ్బాయి రాగానే అతని వెంట వెళ్లిపో తారు..అంతేనా?'' నవ్వింది కల్పన.

''అది సహజం కల్పనా! అతడెలాంటి వాడైనా ఏ తల్లీ తన బిడ్డను వదులుకోదు. జయమ్మ గారూ! మీవన్నీ సర్దుకుని రెడీగా వుండండి! నేను క్లినిక్‌కి వెళ్లొస్తాను!'' అంటూ, రఘురాం లేచి వెళ్లి పోయాడు.

కల్పన పనిపిల్ల సహాయంతో వంట పనిలో పడింది.

జయమ్మ లేచి తన గదిలోకొచ్చింది. తన బట్టలు సర్దుకుంటూ..సాయంత్రం కోసం ఎదురుచూడసాగింది.

★★★

''జయమ్మగారూ! మీ అబ్బాయి వచ్చాడు'' కల్పన సంభ్రమంగా చెప్పింది.

అప్పుడే స్కూలు నుండి వచ్చిన పాపతో కబుర్లు చెప్తున్న జయమ్మ దిగ్గున లేచింది.

''ఎక్కడా?''

''హాల్లో కూర్చుని మాట్లాడుకుం టున్నారు. మీరు వెళ్లండి..నేనిప్పుడే

వస్తాను!'' అంటూ కల్పన తన గదిలోకెళ్లింది.

జయమ్మ హాలు గుమ్మంలో కర్టెను ప్రక్కగా నిలబడింది. లోపలికి వెళ్లాలా? వద్దా? పిలిస్తే వెళ్లొచ్చులే అనుకుని...మెల్లగా కర్టెను తొలగించి చూసింది..కొడుకు వీపు మాత్రమే కనబడుతోంది. మాటలు స్పష్టంగా వినబడుతున్నాయి.

''రాజారావుగారూ! మీ అమ్మగారు మీకిన్నాళ్లకు గుర్తుకొచ్చారా? ఆమెని శరణాలయంలో చేర్పించి చేతులు దులుపుకున్నారు. మళ్లీ ఆవిడ అతీ-గతీ పట్టించుకోలేదు..'' శరణాలయం మేనేజరు శ్రీధర్ అంటున్నాడు.

''ప్రతి నెలా డబ్బు పంపిస్తున్నానే!''

''ఎక్కడ పంపారు? కేవలం మూడు నెలలు పంపించారు. ఆ తర్వాత మానేశారు. నాకేం చేయాలో తోచలేదు. ఆవిడ్ని ఆశ్రమంలో వుంచాలా? పంపించేయాలా? ఎక్కడికి పంపాలి? నేనిలా సందిగ్ధంలో వుండగా డాక్టరుగారు దేవుడిలా ఆదుకుని వాళ్లింట్లో ఆశ్రయం ఇచ్చారు. లేకపోతే ఆవిడ ఏమైపోయేది?'' శ్రీధర్ కోపంగా అంటున్నాడు.

ఆ మాటలకు హాల్లో వున్న రాజారావుతో పాటు కర్టెన్ పక్కన నిలబడిన జయమ్మ కూడా ఆశ్చర్యపోయింది. 'తన కొడుకు ఆశ్రమంలో తన పోషణకు డబ్బు కూడా పంపలేకపోయాడా? ఇన్నాళ్లూ తనకీ విషయం తెలీదు. డాక్టరుగారింట్లో తన అవసరం వుందని చెప్తే వచ్చాననుకుంది. కానీ ఆశ్రమంలో నుండి తరిమేస్తే డాక్టరుగారు ఆదుకున్నారని, ఇప్పుడు తెలిసింది. తను వారికెంతో ఋణపడి వుంది' అనుకుంది జయమ్మ.

''శ్రీధర్‌గారూ! మీరు చెప్పేంతవరకు నాకీ విషయాలేమీ తెలీవు. ప్రతినెలా జీతం రాగానే నీరజకిచ్చేస్తాను. శరణాలయానికి డబ్బు పంపాలని గుర్తు చేసేవాడిని. ఆమె పంపిస్తున్నాననీ చెప్పేది. కానీ ఇలా చేస్తుందనుకోలేదు. నన్ను క్షమించండి!'' అన్నాడు రాజారావు.

''అయితే నేను రాసిన వుత్తరాలు కూడా ఆవిడే దాచి వుంటుంది'' అన్నాడు శ్రీధర్.

రఘురాం కల్పించుకున్నాడు.

''పోన్లెండి...జరిగిపోయిందెందుకు..ఇప్పటికైనా ఆవిడ్ని తీసుకెళ్లడానికి వచ్చారు..అదే చాలు..''

''అది కాదు డాక్టరుగారూ! ఆవిడ ఆశ్రమంలో చేరి సంవత్సరం దాటింది. ఒక్కసారి కూడా చూడటానికి రాలేదు. ఆవిడ ఎంత గొప్ప స్త్రీ..ఆవిడ్ని చూడకుండా శరణాలయంలోని మనుషులు ఒక్కరోజు వుండలేకపోతున్నారు. ఆ సేవ..ఆప్యాయత..ప్రేమ..మదర్ థెరిస్సాని తలపిస్తోంది. అటువంటి అమ్మని ఎలా వదలగలిగారో అర్థం కావడం లేదు..'' శ్రీధర్ బిగ్గరగా అంటున్నాడు!

''పనుల వత్తిడివల్ల రాలేకపోయాను. అదీకాక నీరజ ఆరు నెలల క్రితం తీవ్రమైన అనారోగ్యానికి గురయింది. అందుకే రాలేకపోయాను..మీరందరూ నన్ను మన్నించాలి..ఇంతకీ మా అమ్మ ఏది?..అమ్మా!'' అంటూ పిలిచాడు రాజారావు.

కొడుకు నోట్లోంచి 'అమ్మా' అన్న పిలుపునకు ఆవిడ పులకించిపోయింది. ఎన్ని రోజులకు విన్నాను. మళ్లీ ఈ జన్మలో ఈ పిలుపు వింటానను కోలేదు. ఉద్వేగంతో ఆమె కళ్ల వెంట నీళ్లు వచ్చాయి.

''జయమ్మగారూ!'' రఘురాం పిలిచాడు.

జయమ్మ కళ్లు తుడుచుకుని హాల్లోకి వచ్చింది.

''అమ్మా! బాగున్నావా?'' సోఫాలో నుండి లేచి తల్లి దగ్గరకు వచ్చాడు రాజారావు.

జయమ్మ ప్రేమగా కొడుకుని చూస్తూ ''నేను బాగానే వున్నాను నాయనా! నువ్వు-కోడలు ఎలా వున్నారు?'' అనడిగింది.

''నేను బాగానే వున్నాను. కానీ నీ కోడలికే ఒంట్లో బాగాలేదు..''

''ఏమైంది?''

''నీరజకి పక్షవాతం వచ్చిందమ్మా. మంచం నుండి లేవలేదు..'' అన్నాడు బాధగా.

''అరె! చిన్న వయసులో పక్షవాతమా?'' రఘురాం అన్నాడు.

''ఆమధ్య కారు కొన్నాను. దాన్ని నీరజ డ్రైవ్ చేస్తోంటే ఆక్సిడెంటయింది. కాళ్లు తలుపులో ఇరుక్కుపోయి కాళ్ల నరాలు దెబ్బతిని చచ్చుపడిపోయాయి. మంచంలో నుండి లేవలేదు. డాక్టర్లు మందులిస్తున్నారు. కానీ ప్రత్యేక శ్రద్ధతో ఎవరైనా సేవ చేసి జాగ్రత్తగా చూసుకుంటే మళ్లీ కాళ్లు వస్తాయన్నారు..అందుకని..'' ఆగాడు తల్లివేపు చూస్తూ.

జయమ్మకు అర్థమైంది.

''అమ్మా! నువ్వు తప్ప కోడలికి అంత శ్రద్ధతో సేవ చేసే వాళ్లెవరున్నారు? నువ్వు రావాలమ్మా..నిన్ను తీసుకెళ్లడానికి వచ్చాను..నువ్వు తప్ప మాకెవరున్నారు'' ప్రాధేయపడుతూ అన్నాడు రాజారావు.

''కోడలికి నేనంటే అసహ్యం కదా నాయనా! నా సేవ పనికొస్తుందో లేదో?'' అంది జయమ్మ.

''ఇప్పుడటువంటిదేం లేదమ్మా! తను చాలా మారింది. గతమంతా మర్చిపోయింది. నిన్ను తీసుకురమ్మని తనే పంపిందమ్మా! రామ్మా! నువ్వు వస్తే నీరజకి కాళ్లు వచ్చేసినట్లే..'' అన్నాడు. కొడుకు మాటలు జయమ్మ గుండెల్లో బాణాల్లా దిగాయి. కొడుకు వుత్తరం చూసినప్పట్నించీ పొందిన ఆనందం ఆవిరైపోయింది. కొడుకు తన మీది ప్రేమతో తనని తీసుకెళ్లడానికి రాలేదు. కోడలికి సేవకురాలిగా తీసుకెడుతున్నాడు. తను ప్రత్యేక శ్రద్ధతో పని చేసి కోడలికి కాళ్లు వచ్చేలా చేయాలి.

''ఏమిటమ్మా! ఆలోచిస్తున్నావ్..త్వరగా బయలుదేరు. ఇంకో గంటలో ట్రెయినుంది. నీరజ మన కోసం ఎదురుచూస్తుంటుంది..పదమ్మా!'' రాజారావు తొందర పెట్టసాగాడు.

''నాయనా! రాజా! నేను రాలేనురా!'' అంది జయమ్మ మెల్లగా.

ఆ మాటతో రాజారావుతోపాటు మిగిలిన వారు కూడా తెల్లబోయారు.

''అమ్మా! నిజంగానే అంటున్నావా?''

''అవున్నాయనా! కోడలు లక్షాధికారి బిడ్డ..మరో పెద్ద ఇంజనీరు భార్య..డబ్బు పారేస్తే నాకంటే ఎక్కువ శ్రద్ధతో సేవ చేసే పనివాళ్లు ఆమెకు ఎంతోమంది దొరుకుతారు. కానీ ఇక్కడ ఈ శరణాలయంలోని వృద్ధులందరూ నా వంటి అనాథలు. వారికి సేవకుల్ని పెట్టుకునే డబ్బు లేదు. నేనూ డాక్టరుగారింట్లో వుంటున్నా రోజూ ఏదో సమయంలో అక్కడికెళ్లి వారికి సేవలు చేస్తాను. నేవెళ్లిపోతే వారికెవరు సేవ చేస్తారు. నీ భార్యకు నాలాటి సేవకులు ఎందరో దొరుకుతారు. కానీ వీళ్లకు నేనొక్కదాన్నే. నువ్వు నన్ను దిక్కులేనిదాన్ని చేస్తే ఈ శరణాలయం నాకు దిక్కయింది. ఈ ఆలయాన్ని విడిచి రాలేను. అంతేకాదు నాయనా! నీ భార్య రేపు ఆరోగ్యవంతురాలైనాక ఆమెకు నేనంటే అసహ్యం కలగొచ్చు. అప్పుడు నన్నెవరాదరిస్తారు? ఇంక జీవితంలో ఎదురుదెబ్బలు తినే ఓపిక లేదు. నన్నిలా బ్రతకనీ తండ్రీ!''

అంటూ గిరుక్కున వెనక్కి తిరిగి లోపలకు వెళ్లిపోయింది జయమ్మ!

★

